# 25

# పరిశుద్ధాత్మ ఎలా మార్చుతాడు

ఒక పాపి మార్పు పొందడంలో పరిశుద్ధాత్మ ఎలా పని చేస్తాడన్న ప్రశ్న సాధారణంగా అపార్థం చేయబడి, అనుభూతి వాదంలో కప్పబడింది. ఆత్మ యొక్క పనిని గూర్చిన గజిబిజి పరిశుద్ధాత్మ ఉన్నాడా లేడా అన్న విషయానికి సంబంధించింది కాదు, లేక ఆయన పని చేస్తాడా లేడా అనే దాన్ని గూర్చి కూడా కాదు. సామాన్యంగా వీటి విషయంలో ఏకీభావమే ఉంది.

పాపి కొరకు ఆయన ఏమి చేస్తాడు అనే విషయం చర్చించనవసరం లేదు; ఆయన ఒప్పిస్తాడు, విశ్వాసాన్ని పుట్టిస్తాడు, నడిపిస్తాడు అనేవాటి విషయంలో మనం అంగీకరిస్తాం. అయితే వీటిని ఆయన ఎలా జరిపిస్తాడు అనేది నిజమైన ప్రశ్న.

రెండు అభిప్రాయాలు చెప్పబడ్డాయి: అందులో ఒకటి, ఆయన తక్షణమే అద్భుతంగా పని చేస్తాడు అనేది; మరొకటి, ఆయన దేవుని వాక్యము అనే మాధ్యమం ద్వారా పని చేస్తాడు అనేది. ఈ అంశాన్ని మనం చర్చించుతుండగా, నిజమైన స్థితి ఏదో విదిత మౌతుంది.

## ఆత్మ ఎవరు?

స్పష్టంగా తెలపవలసిన నిజం ఏమిటంటే – పరిశుద్ధాత్మ దేవత్వంలోని ముగ్గురు వ్యక్తులలో ఒకడు. ఆదికాండం మొదటి అధ్యాయంలో (1:2), భౌతికమైన సృష్టి చేయబడే టప్పుడు ఆయన ప్రస్తావించబడ్డాడు. దానికి తోడు, మత్తయి 28:19; 1 యోహాను 5:8ల వంటి లేఖన భాగాల్లో ఆయన తండ్రితోను, క్రీస్తుతోను ప్రస్తావించబడ్డారు.

ఆత్మను సూచించేటప్పుడు తరచుగా వ్యక్తిగతమైన సర్వనామాలు ఉపయోగింప బడ్డాయి (యోహాను 14:16, 17, 26). వ్యక్తి యొక్క గుణగణాలు ఆయనకు ఆరోపింపబడ్డాయి. ఆయన బోధిస్తాడు (లూకా 12:12; యోహాను 14:26), మాట్లాడతాడు (హెబ్రీ. 3:7; 1 తిమోతి 4:1), ఎరుగుతాడు (1 కొరింథీ. 2:11). ఆయన విజ్ఞాపన చేస్తాడు (రోమా 8:26); ఆయన దుఃఖపరచబడగలవాడై ఉంటాడు (ఎఫెసీ. 4:30).

పరిశుద్ధాత్మ కేవలం భూతంలాటి వాడుకాడని, ఆయన జ్ఞాన వివేకములుగల వ్యక్తియని మనం గ్రహించినప్పుడు, ఆయన పని చేసే విధానం స్పష్టంగా తెలియవస్తుంది. ఒక వివేకియైన నరుడు మరొక నరుని ఎలా ప్రభావితం చేస్తాడో అదే విధంగా పరిశుద్ధాత్ముడు ప్రజల మీద ప్రాబల్యం చూపగలడు.

## అపొస్తలుల కాలంలో మార్పిడిలు

అపొస్తలుల కాలంలో జరిగిన మార్పులలో దేవుని తీరును గమనించడం పరిశుద్ధాత్మ పని చేసే పద్ధతిని కనుగొనడానికి శ్రేష్ఠమైన మార్గం. అపొస్తలుల కార్య గ్రంథము మార్పుల గ్రంథమైయుంది. మార్పులలో రెండు సంఘటనలను ఎన్నుకొని, పరిశుద్ధాత్మ వాటిలో ఒక్కొక్క

దానియందు ఎలా పని చేశాడో గమనించుదాం.

ఒప్పించి, మార్పు చేసే తన పనిని ప్రారంభించడానికి ఆత్మ వచ్చిన దినం అపొ. 2 దాఖలు చేసింది. ఆ ఒక్క రోజుననే మూడువేల ఆత్మలు ఆయనచే ప్రభావితం చేయబడ్డాయి. శ్రోతలుగా ఉన్న వారియందు ఆత్మ ఎలా నిర్వహించాడు? పేతురు పలికిన మాటల ద్వారానే పని చేసినట్టు మనం చూడగలం. ఆత్మ అతనికి వాక్‌శక్తి అనుగ్రహించిన కొలది అతడు మాట్లాడాడు (మత్తయి 10:20).

ఐతియొపీయుడైన నోబుల్‌మన్ కథ అపొ. 8లో చెప్పబడింది. తప్పక, అతడు యథార్థంగానే మార్చబడ్డాడు, అయితే అతడు ఆత్మవలననే మార్చబడ్డాడా? అతడు అలా మార్చబడినట్టు అందరు అంగీకరిస్తారు. అలాటప్పుడు, ఆత్మ అతన్ని ఎలా ప్రభావితం చేశాడు? మాట్లాడుటలో పరిశుద్ధాత్మచేత నడిపింపబడిన ఫిలిప్పు యొక్క ఉపదేశం ద్వారా అతడు మార్పు పొందినట్లు పైపైన చదివితేనే తెలిసి వస్తుంది.

ఆత్మ మాటల ద్వారా పని చేశాడని, మాటలకు వెలుపల కాదని ఈ సంఘటనలు బయలుపరచుతున్నాయి. దైవ ప్రేరేపితులైన మనుష్యుల ప్రసంగాలను చదువుతున్నప్పుడు, ఆత్మ యొక్క సందేశాన్ని వారు వింటున్నారు. ఆ మాటలచే వారు మార్పు చెందినప్పుడు, ఆత్మచేత వారు మార్చబడినవారై ఉంటారు. వారు విన్నదాన్ని నిరాకరించినప్పుడు, వారు ఆత్మను ఎదిరించువారైయుంటారు (అపొ. 7:51, 52). తన ఉపదేశాన్ని నిరాకరించుతున్నవారు పరిశుద్ధాత్మను ఎదిరించుతున్నవారై ఉన్నట్టు స్తెఫను నేరస్థాపన చేశాడు (అపొ. 7:51).

## నేడు జనులను ఆత్మ ఎలా మార్చుతాడు?

అపొస్తలుల కాలంలోని మార్పులలో ఆత్మ ఏమి చేసాడో నేటి మార్పులలో కూడ ఆయన అలాగే చేస్తాడా? అవును. దైవ ప్రేరేపితులైన మనుష్యులు నేడు మనకు లేరు, కదా? లేరు. అద్భుతముల కాలం అంతరించింది. ఏదియెలాగున్నా, ఆత్మ వారిని తమ ప్రకటనల్లో నడిపించడం మాత్రమే కాదు, వారి రచనల్లో కూడా నడిపించాడు. ఈ విధంగా, దైవ ప్రేరేపితమైన వారి మాటలు నేడు మనతో “మాట్లాడడానికి” ఉన్నాయి. లేఖనాలు పరిశుద్ధాత్మ యొక్క పలుకులే.

హెబ్రీ. 3:7లోని పాత నిబంధన కొటేషన్ ఆత్మకు ఆరోపించబడింది. 2 పేతురు 1:20, 21 మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడి దేవుని మూలముగా పలికినట్టు చెప్పింది. అలాగే 2 తిమోతి 3:16, లేఖనాలు దైవ ప్రేరేపితములని తెలిపింది. ప్రకటన 2, 3ల్లో ఆత్మ సంఘములతో చెప్పుచున్న మాటలు వినాలని యోహాను బుద్ధి చెప్పాడు. యోహాను వ్రాసిన సందేశాన్ని వారు లక్ష్యపెట్టవలసినవారై యున్నారు.

వాక్యానికి, ఆత్మకు ఎందుకు తరచుగా ఒకే పని ఆరోపించబడుతుంటుందో మనం చూస్తాం. జీవం ప్రసాదించడంలో (యోహాను 6:63), క్రొత్త జన్మ (యోహాను 3:5; 1 పేతురు 1:23), పరిశుద్ధపరచబడడంలో రెండును జతకూడియున్నాయి (1 కొరింథీ. 6:11; యోహాను 17:17).

ఉదాహరణకు, పరిశుద్ధపరచబడడం అనేదాన్ని ఆలోచిస్తే, మన ప్రశ్న ఎలా విశద మౌతుందో చూద్దాం. మనం ఆత్మచేతను, వాక్యంచేతను పరిశుద్ధపరచబడతాం. ఆత్మ వాక్యంద్వారా పరిశుద్ధపరుస్తాడు. ఆత్మ వ్యక్తియై ఉన్నాడు; వాక్యము సాధనమైయుంది. అది

ఆత్మ ఖడ్గము (ఎఫెసీ. 6:17). మనిషి గొడ్డలితో చెట్టును నరుకుతాడు. ఈ పనిలో రెండింటికి పాలు ఉంది, అయితే ఆ మనిషి సాధనం ద్వారా ఆ పని చేస్తాడు. అలాగే, ఆత్మ తన ఖడ్గాన్ని వినియోగించి పని చేస్తాడు, అది లేకుండా కాదు.

## ముగింపు

ఆత్మను గూర్చి బైబిలు బోధించే ప్రతిదానిని మనం అంగీకరించాలి. పాపి యొక్క హృదయం మీద ఆయన ఎలా పని చేస్తాడు? ఆయన వాక్యం ద్వారా. అగోచరమైన విధానంలో ఆయన పని చేయడు. ఆయన ఉపదేశాన్ని మనం అంగీకరించి లోబడినప్పుడు, మనం ఆత్మ ద్వారా నడిపింపబడినవారమైయుంటాం. ఆత్మచే నడిపింపబడినవారు దేవుని పిల్లలైయుంటారు (రోమా 8:14). నీవు ఆత్మను అంగీకరిస్తున్నావా, లేక ఆయనను ఎదిరించుచున్నావా?